108 సిబ్బంది సేవలు అమూల్యం

విశాలాంధ్ర-పలాస : రాష్ట్ర ప్రభుత్వం రోగులు, ప్రమాద సమయంలో తీవ్ర బాధతో ఉన్న క్షతగాత్రులకు తక్షణ వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో ఏర్పాటుచేసిన 108 సిబ్బంది సేవలు అమూల్యమని, అందులో పనిచేస్తున్న 108 సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని పలాస లయన్స్ క్లబ్ క్యాజు ల్యాండ్ వనిత అధ్యక్షురాలు మల్లా జయశ్రీ అన్నారు. కాశీబుగ్గలో పలాస లైన్స్ క్లబ్ క్యాజు ల్యాండ్ వనిత ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవ సందర్భంగా 108 సిబ్బందికి ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 108 సిబ్బంది అందించిన సేవలు ద్వారా ఎన్నో ప్రాణాలు కాపాడడం జరిగిందన్నారు. ఏ సమయంలో ఫోన్ వచ్చిన విసుగు చెందకుండా రోగులు, క్షతగాత్రులకు సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ క్యాజులాండ్ వనిత కార్యదర్శి తర్లానా శ్వేత కుమారి, కోశాధికారి మల్లా సంతోషి, 108 జిల్లా మేనేజర్ డి హరి ప్రసాద్, పి.గోపి, ఎన్ వెంకటరావు, ఎస్.ఆనందరావు, బి.శ్రీనివాసరావు, ఎస్.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అల్లినగరం గ్రామంలో షకలక శంకర్ టీం సందడి

విశాలాంధ్ర-రణస్థలం : మండలం అల్లివలస గ్రామంలో సినిమా యాక్టర్ షకలక శంకర్ వారి బృందం గత కొన్ని రోజులుగా తూర్పు జిల్లా వాసులపై చేస్తున్న అద్భుతమైన పాట ఆదివారంతో షూటింగ్ పూర్తి చేసుకున్నందుకు అల్లివలస గ్రామ ప్రజలకు అక్కడ ఉన్న నాయకులకు ఈపాట షూటింగ్‌కు ప్రోత్సహించిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలియ జేసుకున్నట్లు షకలక శంకర్ అండ్ టీం. తెలియజేశారు. ఈసందర్భంగా శంకర్ మాట్లాడుతూ మన జిల్లావాసులు చాలామంది కళాకారులుగా, గాయకులుగా నృత్య కళాకారులుగా ఉన్నారని వారందరిని ప్రోత్స హించాలని ఉద్దేశంతోనే రణస్థలం మండలంలో షూటింగ్ ఎంచుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా రానున్న రోజుల్లో మరెన్నో సినిమా షూటింగ్‌లు మన శ్రీకాకుళం జిల్లాలో చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాతగా బవిరి ప్రదీప్, సహాయ నిర్మాతగా వుద్వాల అంజిబాబు, కొరియోగ్రాఫర్‌గా ఎంజే సంజయ్ (ఢీ షో అభ్యర్థి) కెమెరామన్ స్వామి, అదేవిధంగా అల్లివలస సర్పంచ్ చీకటి ఎర్రయ్య, పండోడు, పొట్టివాడు తదితరులు శంకర్ టీంకు సహకరించిన వారిలో ఉన్నారు.

ఓటర్ వెరిఫికేషన్ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి : ఎమ్మెల్యే అశోక్

విశాలాంధ్ర-కవిటి : ఓటర్ వెరిఫికేషన్ పట్ల ప్రతి ఒక్కరు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఎం ఎల్ ఏ డాక్టర్ బెందాలం అశోక్ నాయకులకు సూచించారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రమైన కవిటి లోల్ల నారాయణమూర్తి కళ్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి క్లస్టర్, యూనిట్, బూత్‌స్థాయి ఇన్చార్జిలు, నియోజకవర్గ ఇన్ఛార్జ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియ గడువు ఈనెల 21వ తేదీలోగా ముగుస్తుందని కావున కొత్తగా ఓటర్లు నమోదు చేయాలన్న ఓటర్లు తొలగింపులు ఉంటే నమోదులు చేపట్టాలన్న నకిలీ ఓటర్లు గుర్తించాలన్న ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు.ఓటర్ బూత్ వెరిఫికేషన్ హౌస్ మ్యాపింగ్ కార్యక్రమాన్ని విస్తృతం చెయ్యాలనీ ఆ బాధ్యతను క్లస్టర్ ఇంచార్జిలు బూత్ ఇన్చార్జిలు పూర్తిగా దృష్టి సారించాలనీ తెలిపారు.ఈ నెల 21 వ తేదీ నుంచి ఎలక్షన్ కమిషన్ తలపెట్టిన ఓటర్ జాబితా పరిశీలన కార్యక్రమంలో బిఎల్ఓతో పాటుగా క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు భాగస్వాములు కావాలని కోరారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వచ్చి ఓటర్ వెరిఫికేషన్ చేపడతారు. ఈ సందర్భంగా మీ ఓటు ఉందో లేదో చెక్ చేయాలనీ ఓటు లేకపోతే తక్షణమే ఓటరుగా పేరు నమోదు చేయించాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు అయినా ఏక్షణంలో అయినా రావొచ్చు ప్రతి ఒక్కరూ సంసిద్ధంగా ఉండాలని కోరారు. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్న భారీ మూల్యాన్ని చెల్లించుకోక తప్పదని అన్నారు.తెలుగుదేశం పార్టీ గెలుపుకు ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పొందల కృష్ణారావు, బి. రమేష్, ఎస్వీ రమణ, ఢిల్లీరావు, సంతోష్ కుమార్ పట్నాయక్, చిన్న బాబు, బాసుదేవ రౌలో, భీమరావు రౌలో తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకి జీతాలు చెల్లించాలి : ఏపీటీఎఫ్ మండలశాఖ డిమాండ్

విశాలాంధ్ర-మందస : ఇటీవల కాలంలో 117జీవో ద్వారా రివర్షన్‌కి గురైన ఉపాధ్యాయులకు, ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు, డిడిఓలు లేని ఉన్నత పాఠశాల లోని ఉపాధ్యాయులకు, అలాగే హైస్కూల్ ప్లస్ పాఠశాలలలో పీజీటీలుగా నియమితులైన ఉపాధ్యాయులకు మరియు 2వ మండల విద్యాశాఖ అధికారులుగా నియమితులైనవారికి జూన్, జూలై నెలల జీతాలు వెంటనే చెల్లించాలని ఏపీటీయఫ్ మందస మండల శాఖ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంవద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం జీతాల సమస్యకి సంబంధించిన వినతిపత్రంను తహసీల్దార్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్సులు నల్ల. ఢిల్లీశ్వర రావు,దున్న చంద్రశేఖర్, ఏపీటీయఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గవ్వ భీమారావు, కార్యవర్గ సభ్యులు డి.రామారావు, బి.రామారావు, యస్.నారాయణరావు, పీటిజి గైర్వాణి, చిరంజీవి, డి.వైకుంఠరావు, సింహాచలపతి, యస్ కిరణ్‌కుమార్, సీనియర్ ఉపాధ్యాయులు యస్.గణేశ్వరరావు, యస్ అప్పారావు, యస్.జగన్నాథం, యల్.సాంబమూర్తి, బి.రామారావు, ప్రభాకర్ పట్నాయక్, బి.జ్యోతీశ్వరి, యస్.కొటేశ్వరి, జి.అనసూయ, యం.దామోదరం, గంగాధర్, బాలర్జున పాత్రో, యస్.అబ్రహం, పి.భీమారావు, పి.రాంప్రసాద్, ఇతర మండల ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట తప్పను, మీ వెంటే ఉంటాను

జీడీ రైతులకు పోర్ట్ పరిహారం పంపిణీ చేసిన ఎమ్మెల్సీ దువ్వాడ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఎటువంటి పరిస్థితులు లో మాట తప్పేది లేదని, ఎన్ని అడ్డంకులు వచ్చిన మీవెంటే ఉంటానని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ రావు అన్నారు. ఆదివారం మూలపేట పోర్టు నిర్మాణంలో నష్టపోయిన జీడితోటలకు నష్టపరిహారం చెక్కులను లబ్ధిదారులకు ఆయన చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాసితులతో మాట్లాడుతూ, అపోహలు నమ్మవద్దని, అభివృద్ధి కి అందరూ సహకరించాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి మండలం జెడ్పీటీసీ పాల వసంత రెడ్డి, విశ్వ సముద్రం కంపెనీ జనరల్ మేనేజర్ శంకర్, మూలపేట ఉపసర్పంచ్ జీరు రాంబాబు, కోట దాలయ్య, జీరు శివరెడ్డి, జీరు రోనంకిరెడ్డి, దారపు అప్పలరెడ్డి, జీరు శేఖర్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను ప్రతీ ఒక్కరు గమనించి వ్యవహరించాలని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి ఆశి లీలారాణి కోరారు. పార్టీ నిర్దేశం ప్రకారం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ బాబు సూచనల మేరకు 17 వ వార్డ్ లో మహాశక్తి కార్యక్రమాన్ని ఆ వార్డు ఇన్‌చార్జి జన్నెల సంతోష్ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షులు కాళ్ళ ధర్మారావు సమన్వయంతో ఆదివారం నిర్వహించారు. తెలుగుదేశం బి.సి (రెడ్డిక)సాధికార సమితి కన్వీనర్ కొండా.శంకర్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ళ.జైదేవ్, 3వ వార్డు కౌన్సిలర్ పత్రి తవిటయ్య తదితరులతో కలిసి వార్డులో ప్రచారాన్ని చేపట్టి, అనంతరం నిర్వహించిన సమావేశంలో ప్రస్తుత ప్రభుత్వం హయాంలో ఎదురవుతున్న ఇబ్బందులు ధరల పెరుగుదల పర్యావసానాలు తదితరాల గూర్చి మహిళలకు అవగాహన కల్పించారు. పార్టీ స్థాపన నుండి పేద ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న తెలుగుదేశం పార్టీకి అధికారం అప్పగించి ఆనందకరమైన పాలన పొందాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో నారా చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టే బాధ్యతను ప్రతీ మహిళ తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పైల నారాయణ, మల్లా.సిద్ధార్ద్, కూన.అన్నపూర్ణమ్మ, రెయ్యి భాగ్యం, కోరాడ లక్ష్మీ, గిలాయి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆస్తులను కాపాడండి

పలువురు ప్రజాప్రతినిధుల డిమాండ్

విశాలాంధ్ర-జలుమూరు: మండల కేంద్రం జలుమూరులో రెండు దశాబ్దాల క్రితం లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్ స్టేషన్ పలువురి ఆక్రమణలకు గురయిందని జలుమూరు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో నిర్వహించిన మండల సమావేశంలో బస్టేషన్ అక్రమ విషయంపై అధికారులు దృష్టిలో పెట్టినా, నేటికీ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం పలువురు పలు విమర్శలు వినిపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులను ఎఇలా పరాయివారి చేతుల్లో ఉండడం బాధాకరమని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆర్టీసీ ఉన్నతాధికారులు తమ ఆస్తుల్ని " కాపాడుకోవాలని పలువురు కోరుతున్నారు.

పదేళ్ళ కాలంలో రైల్వే వ్యవస్థలో మార్పులు

- రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు
- రైల్వే పనులకు వర్చువల్ విధానంలో ప్రధాని నరేంద్ర మోడీ శంకుస్థాపన

విశాలాంధ్ర-పలాస : బిజెపి ప్రభుత్వం హయాంలో పదేళ్ల కాలంలో రైల్వే వ్యవస్థలో పలు మార్పులు చోటుచేసుకున్నాయని, రైల్వే అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఆదివారం రూ. 23.85 లక్షలు వ్యయంతో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఢిల్లీలో వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంను రైల్వే అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధికారులు ఏర్పాట్లు చేసిన టివిలులో తిలకించారు. అనంతరం పలాస రైల్వే స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎంపిక చేసిన 508 రైల్వే స్టేషన్లలో పలాసను ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. వైద్యునిగా ఉన్న సమయంలో 60కి పైగా దేశాల్లో పర్యటించానని, అక్కడున్న విలాసవంతమైన, వేగవంతమైన రైళ్లను చూసి మన దేశంలో ఎప్పుడొస్తాయని ఎదురుచూడగా, వందే భారత్ రూపంలో ప్రజల కల సాకారమయ్యిందన్నారు. వందేభారత్, కోరమాండల్, షిరిడీ, రామేశ్వరం ఎక్స్ ప్రెస్ రైలుకు పలాస రైల్వే స్టేషన్‌లో హాల్ట్ కల్పించాలని రైల్వే అధికారులను కోరారు. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు చెందిన లక్షలాది ప్రజలు ఛత్తీస్ ఘడ్, బిలాయి ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారని, వారికి పలాస నుంచి బిలాయ్ వరకు ప్రతీ రోజు రైలు సౌకర్యం కల్పించాలని కోరారు. తాళ్లభద్ర వద్ద ఆర్ఓబీ ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన ఆర్థిక పరమైన సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. నర్సిపురం కాలిబాట మార్గాన్ని త్వరగా పునరుద్ధరణ చేపట్టాలని రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. అంబుసోలి ప్రాంతంలో రైల్వే ఆస్తులను ఆక్రమించారని పలువురికి ఇటీవల నోటీసులు ఇచ్చారని, వాటిని రెగ్యులరైజ్ చేస్తే వాటి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైల్వే శాఖకు భూమిని ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్దేశించి పలు పాఠశాలల్లో విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించగా విజేతలైన వారికి ప్రశంసపత్రాలతోపాటు జ్ఞాపికలను మంత్రి అప్పలరాజు అందజేశారు. కార్యక్రమంలో భువనేశ్వర్‌కు చెందిన సీఎంపీఈ ఎస్ కే.సమాల్, బరంపురానికి చెందిన ఎడిఈఎన్ ఆర్ఆర్.దాస్, పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, స్థానిక కౌన్సిలర్ గుజ్జు జోగారావు, జి.ఎల్.రావు, ఎన్‌విఎల్‌ఎన్ మూర్తి, బిజెపి జిల్లా అధ్యక్షుడు ఉమామహేశ్వర రావు, కొర్ల కన్నారావు డాక్టర్ అనూష, అక్కడ రవి బాబ్జీ, ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో యాదవులపై దాడులు

రాష్ట్ర టీడీపీ బీసి సెల్ ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు యాదవ్

విశాలాంధ్ర-కాశీబుగ్గ : వైసీసీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఉన్న యాదవుల కటుంబాలపై చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ అన్నారు. ఆదివారం కాశీబుగ్గలో జిల్లా యాదవుల సాధికారిత మేధోమధన సదస్సు పార్ల మెంటరీ కన్వీనర్ ఐ.జగదీష్ యాదవ్ అధ్యక్షతన నిర్వ హించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బీసి సామాజికవర్గ కుటుంబాలను విస్మరించిందన్నారు. తెలుగుదేశం పార్టీ హయంలో యాదవులకు ప్రథమ స్థానం కల్పిస్తే, ఈ ప్రభుత్వం దూరం చేసిందన్నారు. టీటీడీ చైర్మన్‌ను యాదవ కులానికి చెందిన సుధాకర్‌ను కాదని అగ్రకుల రెడ్డిని నియమించడంపట్ల తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో యాదవులకు వెనుకస్థానం కల్పించి రెడ్డి సామాజిక వర్గంనకు మొదటి స్థానంలో పెడుతున్నారన్నారు. రాజ్యాధికారంలో యాదవు లకు భాగస్వామ్యులు చేయాలని, గొర్రెల కాపారు లకు తప్పిడి గుళ్ళు కళాకారులకు 50 ఏళ్ళకు పింఛను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరిత్య వల్ల నష్టపోయిన కుటుంబాలకు రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. యాదవులను బీసి-డి నుంచి బిసి-బిలోకి చేర్పించే విధంగా కొన్ని డిమాండ్లతో కూడిన తీర్మానాలు తీసుకున్నామన్నారు. రానున్న రోజుల్లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తర్వాత యాదవులకు సముచిత స్థానం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో యాదవ నాయకులు డి.తాతారావు, ఢిల్లీరావు, జగదీష్, ధర్మారావు, డి.నర్సింగులు తవిటయ్య, కూర్మారావు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే మత్స్యకారులకు అభివృద్ధి పథకాలు

- రైల్వే అభివృద్ధికి ఎంపీ రామ్మోహన్ నాయుడు కృషి
- మంత్రి విమర్శలపై మత్స్యకార నాయకులు ఖండన

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి హయాంలోనే 14 మత్స్యకార కులాలుకు సంక్షేమ పథకాలు అందాయని మత్స్యకార సంఘం నాయకులు సూరాడ ధనరాజు, సూరాడ భీమారావు, సూరాడ దాసురాజు అన్నారు. మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మత్స్యకారులకు చంద్రబాబు నాయుడు ఏమి చేశారని, అలాగే ఎంపీ కింజరావు రామ్మోహన్ నాయుడు ఏమి చేసారని మంత్రి సీదిరి విమర్శలు చేశారని, అటువంటి విమర్శలు ఖండిస్తున్నామని వారు తెలిపారు. మత్స్యకారులకు 50 సంవత్సరాల నిండిన 14 కులాలుకు పెన్షన్ ఇచ్చింది చంద్రబాబునాయుడని, అలాగే మత్స్యకారులకు సబ్సిడీపై బొట్లకు ఆయిల్ ఇచ్చారని, 14 కులాలుకు తెప్పలు, వలలు, బొట్లు కు సబ్సిడీ లోన్లు ఇచ్చి ఆదుకున్నారని వారు అన్నారు. మత్స్యకార భరోసా కుటుంబములో ఎంత మంది ఉంటే, అంత మందికి 4000 రూపాయలు చొప్పున ఇచ్చారని, అలాగే బీసీ, యస్సి, ఎస్టీ, ఇతర కులాలకు టువీలర్, త్రీ వీలర్, ఫోర్వీలర్, మత్స్యకర మహిళలకు వ్యాపార నిమిత్తం కిట్లు ఇచ్చారని వారన్నారు. 2019 తరువాత జగన్మోహన రెడ్డి ముఖ్యమంత్రి అయినా తర్వాత, ఈ జిల్లాలో మత్స్యకారులకు ఏమి చేశారని వారు ప్రశ్నించారు. అన్ని కులాలకు కార్పొరేషన్స్ ఏర్పాటు చేశామని చెప్తున్నారు దానివలన ఉపయోగం ఏంటని, నేను మంత్రిఅని చెప్పుకోవడం తప్ప, మత్స్యకారులకి ఒరిగింది ఏమైనా ఉందా అని అన్నారు. రాష్ట్రంలో 13 జిల్లాలో 50 సంవత్సరాలు నిండిన మత్స్యకారుడికి 200 ఉన్న పెన్షన్ 2000 ఇచ్చిన ఘనత. తుఫాన్ సమయంలో వేటకి వెళ్ళని మత్స్యకారుని రేషన్ కార్డుకి 50కేజీలు బియ్యం ఇచ్చిన ఘనత ఒక్క చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని అన్నారు. కానీ ఈ నాలుగు సంవత్సరాలలో మత్స్యకారులకు సంక్షేమ పథకాలు ఇచ్చే కార్యక్రమం, మీరు కానీ, ప్రభుత్వం కానీ ఇచ్చే దాఖలాలు ఉన్నాయా అని వారు అన్నారు. ప్రస్తుతం మీ నియోజకవర్గములోని పలాస రైల్వేస్టేషన్ అభివృద్ధికి 24కోట్లు రూపాయలు, టెక్కలి నియోజకవర్గం నౌపడా రైల్వేస్టేషన్‌కు 17 కోట్లు, ఆమదాలవలస రైల్వేస్టేషన్ కు 24 కోట్లు జిల్లా మొత్తంగా 65 కోట్లు మంజూరు చేసిన ఘనత ఒక్క ఎంపీ రామ్మోహన్ నాయుడు గారికే దక్కుతుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘం నాయకులు వారాది చంటి, సూరాడ సింహచలం, అర్జాల రాజునిరాకరి, సూరాడ ప్రసాదరావు, సూరాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మృతికి ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం నివాళి

- అతడి పాట శబ్దం కాదు ఒక యుద్ధం
- ఉద్యమాలను నడిపిన పాట జనాలను ఉర్రూతలూగించింది
- ఉద్యమాల వీరుడు గద్దర్ మృతి బాధాకరం

విశాలాంధ్ర-పొందూరు: గద్దర్ పాటంటే గాలికి కొట్టుకొచ్చిన గాలివాటం కాదని, కాలిగోటి నుండి నడినెత్తి దాకా ప్రవహించే పాటల తూటా అని ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాదులో అపోలో ఆసుపత్రిలో గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ మృతి చెందిన గద్దర్ కు సభాపతి నివాళులు అర్పించారు. ప్రజా యుద్ధనౌక దివికేగడం తాను తీవ్ర మనోవేదనకు గురయ్యానన్నారు. తాను ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పనిచేసిన రోజుల్లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నక్సలైట్లను జనజీవన స్రవంతిలోకి తీసుకువచ్చేందుకు చొరవ చూపిందన్నారు. నక్సలైట్ల తరపున గద్దర్ తో పాటు, వామపక్ష ప్రజా అనుబంధ సంఘాలతో చర్చలు జరిపేందుకు ప్రభుత్వంలో గల సభ్యులలో మంత్రిగా తాను ఒకరిని గుర్తు చేసుకున్నారు. ఈ విధంగా గద్దర్ తో తనకు అనుబంధం ఉండేది అన్నారు. గద్దర్ పాట కన్నతల్లులు బిడ్డల్ని పొగొట్టుకున్నప్పుడు పుట్టిందన్నారు. ఆ కలికి నకనకలాడినప్పుడు, భూములు కోల్పోయిన రైతుల కన్నీటి నుండి గద్దర్ పాట పుట్టిందన్నారు. దండు కట్టడానికి పాట కానీ,దండం పెట్టడానికి కాదు పాట... అనేది గద్దర్ అంతరంగిక ఉద్దేశ్యంగా ఉండేదన్నారు. తన పాట దౌర్జన్యాలకు వ్యతిరేకం కోసం అని, దొరతనాలను కీర్తించడానికి కాదని పలుమార్లు నిస్సంకోచంగా తన అభిప్రాయాన్ని వెలబుచ్చేవారిని తెలిపారు. పాటకు ప్రాణంపోసిన గొంతుక,పాట లేకుంటే ప్రాణం ఆగిపోయేటంత మమేకమైనోడు గద్దర్ అని అన్నారు.నక్సల్బరీలో పురుడు పోసుకున్న పాట శ్రీకాకుళం ఉద్యమంలో గర్జించి,గోదారి పోరాటాలలో గజ్జెకట్టి ఆడిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో పొడుస్తున్న పొద్దై,నేలతల్లిని ముద్దాడిన ఆ పాట, జీర గొంతుకతో తనదైన మాట, గజ్జె కట్టిన ఆడిన ఆట తెలుగు నేలపై చిరస్థాయిగా నిలుస్తుంది అన్నారు. గద్దర్ పాటంటేనే ఒక విప్లవం..గద్దర్ అంటే ఒక శబ్దం కాదని, ఈ నేలవున్నంత వరకు చేసే ఒక యుద్ధం అని సభాపతి తమ్మినేని సీతారాం తన ప్రగాఢ నివాళులర్పించారు. గద్దర్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పౌష్టికాహారం... అయినా పిల్లలు తినని వైనం

- జగనన్న గోరుముద్ద మళ్లీ మొదటికే...!
- కమిషన్ ఆదేశాలు పట్టని వైనం
- లోపాలు సరి చేయాల్సిందే

విశాలాంధ్ర-ఆమదాలవలస: పేద విద్యార్థులు ఆకలితో ఆల మటిస్తుంటే చదువులు వంట పట్టవని ఉద్దేశంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న గోరు ముద్ద పథకాన్ని అమలు చేసింది. ఆమదాలవలసలో అమలు చేస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల నిర్లక్ష్యం, పౌష్టికాహార సరఫరాదారుల అలసత్వం వెరసి విద్యా ర్థులు ఆ గోరు ముద్దకు దూరమవుతూ అమ్మ చేతి వంట బాక్స్ మధ్యాహ్న భోజనానికి తెచ్చి విద్యార్థుల మధ్య తినటం చూస్తుంటే నాణ్యతాలోపం ఉందన్న విషయం తెలుస్తోంది. విద్యా సంవత్సరం ఆరంభంలో బాలల హక్కుల కమిషన్ సభ్యులు గొండు సీతారాం నాణ్యత లు పరిశీలించి పౌష్టికాహారాన్ని ప్రతి విద్యార్థి తినవలసిందేనని ఉపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చినప్పటికీ వాటిని పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. మధ్యాహ్న భోజనం తినని విద్యార్థుల తల్లి దండ్రులతో సమావేశాలు నిర్వహించి చర్యలు తీసుకోవాలన్నారు. అప్పటికి తినను అని మొండికేసిన విద్యార్థులు టీసీలు ఇచ్చేయాలని కమిషన్ సభ్యులు వెల్లడించారు. ఆహారం సక్రంగా లేకపోవడంతో గేట్ పాఠశాలలో విద్యార్థులు డస్ట్ బిన్ లో వేస్తున్నారు. కొంతమంది తినక, మరి కొంతమందికే ఆహారం సహించక ఆకలితో పక్క చూపులు చూస్తున్నారని అవగతమవుతుంది. ఉపాధ్యాయులు మధ్య సమన్వయ లోపంతో గోరు ముద్దు పథకం మళ్లీ మొదటికే వచ్చింది. భోజన సమయంలో హెచ్ యం పర్యవేక్షణలో ఉన్నప్పటికీ చూసి చూడనట్టు ధృతరాష్ట్ర వైఖరి అవలంబించడం విశేషం. ప్రభుత్వం విద్యార్థుల

అభిరుచికి అనుకూలంగా మెనూ సంబంధిత సంస్థకు అందించినప్పటికీ విద్యార్థుల గోరు ముద్దను తినేందుకు ఆసక్తి చూపడం లేదు. పౌష్టికాహారం అందించ దంలో ఉపాధ్యాయులు అధికారులు సమన్వయంతో వ్యవహరించి విద్యార్థులందరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవలసిన అవసరం ఉంది. పాలకులు అధికారులు గోరుముద్ద పై ఎప్పటికప్పుడు పరిశీలన చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

గద్దర్ మృతి ఉద్దానంకి తీరని లోటు

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : తన గళం, పాటలతో పామరులను సైతం ఉత్తేజ పరిచిన ప్రముఖ విప్లవ గాయకుడు గద్దర్ మృతి ఉద్దానం ప్రాంతానికి తీరని లోటని వైసీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ సంతాపం తెలిపారు. గద్దర్ కాలికి గజ్జె కట్టి ఉద్దానం లో ఇచ్చిన వివిధ ప్రదర్శనలు ఇప్పటికీ చైతన్యం కలిగిస్తూనే ఉంటాయని తన సంతాపంలో పేర్కొన్నారు. కొత్తనీరు సినిమా ద్వారా సినిమా మాధ్యం లోనూ తన గళం వినిపించారు అని గుర్తు చేసారు. ఉద్దానం ప్రాంతంలోని బొడ్డపాడు, రంగోయి, సోంపేట మండలంలోని మామిడిపల్లి తదితర ప్రాంతాల్లో గద్దర్ పలు ప్రదర్శనలు ఇచ్చారని తెలిపారు. ఉద్దానం తో పాటు జిల్లా కు తీరని లోటని ఉదయ్ కుమార్ తన సంతాపంలో పేర్కొన్నారు.

ఎన్‌పీఎం షాప్ వద్ద కషాయాలు తయారీ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలం ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా సిబ్బంది ప్రకృతి వ్యవసాయ విస్తరణ మరియు శిక్షణ కేంద్రం వద్ద నీమాస్త్రం, మీనామృతం ద్రావణాన్ని తయారు చేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి, మీనాలు మాట్లాడుతూ రైతులకు అందుబాటులో కషాయాలు మరియు ద్రావణాలను అందుబాటులో ఉండేలా చేస్తున్నామని వీటిని రైతులు సకాలంలో పంటలో ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో కూరగాయలు సాగులో కషాయాలు పిచికారి తప్పనిసరిగా ఉంటుంది కాబట్టి ఇక్కడ పురుగులు నియంత్రణకు అవసరమైన కషాయాలు అన్నీ కూడా అందుబాటులో ఉంటాయని అన్నారు. అలాగే గొలివివానిపేట గ్రామంలో బ్రహ్మాస్త్రం అనే కషాయాన్ని తయారు చేశారు. ఇది పంటలలో పురుగుల నియంత్రణకు బాగా ఉపయోగపడుతుందని సిబ్బంది ధనుంజయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు గొలువి రామకృష్ణ, సూరపు అప్పారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-పలాస:మండలం గోపాలపురం గ్రామ సమీపం పాత జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు, స్థానికులు కథనం మేరకు నందిగాం మండలం నౌగాం సర్పంచ్ పుస్య సత్యం బెండిగేటు నుంచి కాశీబుగ్గ వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా మెళియాపుట్టి మండలం పరసురాం పురం గ్రామానికి చెందిన కొర్రాయి ధనుంజయ, కాశీబుగ్గ ట్రాక్టర్ షోరూంలో పని చేస్తున్న రాము కాశీబుగ్గ నుంచి బెండిగేటు వైపు ద్విచక్ర వాహనం పై వెళ్తు బలంగా ఢీకొట్టాడు. దీంతో సర్పంచ్ సత్యం, ధనుంజయకు కాళ్ళు విరిగిపోగా రాముకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా జరిగిన వెంటనే క్షతగాత్రులను పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ వైద్యులు చిన్నం నాయుడు క్షతగాత్రులకు వైద్య సేవలు అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కాశీబుగ్గ పోలీసులు తెలిపారు. కాళ్ళు విరిగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సర్పంచ్ సత్యం

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని ఆర్ బెళగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1984-1990 విద్యా సంవత్సరాలకు చెందిన విద్యార్థులు స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మిత్రులు ఒకరినొకరు పలకరించుకుంటూ ఆనందంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు ఘనంగా సత్కరించారు. అనంతరం తోటి మిత్రుడు జీరు జయరాం అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని 50 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని జయరాంకు అందజేశారు. త్వరలోనే జయరాం ఆరోగ్యం కుదుటపడాలని తోటి మిత్రులు ఆకాంక్షించారు.

గద్దర్ చిరస్మరణీయుడు

విశాలాంధ్ర-పొందూరు : కోట్లాది మంది ప్రజలను తన గళంతో ఉత్తేజ పరచిన అభ్యుదయ, విప్లవ గాయకుడు గద్దర్ చిరస్మరణీయుడని జాతీయ సవర భాషా సంఘం అధ్యక్షుడు, విశ్రాంత రీడర్ డా.అల్లంశెట్టి చంద్రశేఖరరావు, నామ విజ్ఞానవేత్త, ప్రముఖ పుస్తక రచయిత వాండ్రంగి కొండలరావు నివాళులర్పించారు. ఆయన మృతి జానపద విప్లవ కళా, సాహిత్యాలకు తీరని లోటని ఆదివారం విడుదల చేసిన ఓ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ఈరంగాల్లో చెరగని ముద్ర వేశారన్నారు. ఆయన మాట, పాట, వేషధారణ అనుకరణకు సహితం అసాధ్యమన్నారు. ఫిరంగి మోత తరహాలో గద్దర్ ప్రదర్శనలు సాగేవని పేర్కొన్నారు. ఆ జాతీయ కళాకారునికి స్మృతి చిహ్నాలు ఏర్పాటు చేసేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని డా.చంద్రశేఖరరావు, కొండలరావు ఆ ప్రకటనలో కోరారు.

ఎంపీ రఘురామకృష్ణను కలిసిన జనసేన నాయకులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలం జనసేన నాయకులు ఏదూరు చిన్నారెడ్డి, నరసాపురం పార్లమెంట్ సభ్యుడు రఘురామకృష్ణను ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఈసందర్భంగా సంతబొమ్మాళి మండలంలో జనసేన పార్టీ బలోపేతం చేయడానికి ఐకమత్యంగా కృషి చేస్తున్నామని వివరించి నట్లు తెలిపారు. అలాగే, మండలంలో పలు సమస్యలు ఎంపీ దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆయన తెలిపారు.

ఎమ్మార్వోకు వినతి

విశాలాంధ్ర -జలుమూరు: బదిలీలు, పదోన్నతులు, రీఅపోర్షన్ ద్వారా సర్దుబాటు జరిగిన 55 వేల మంది ఉపాధ్యాయులకు జీతాలు ప్రభుత్వం చెల్లించుట లేదని స్థానిక ఎమ్మార్వో బి. సత్యంకు మండల ఎపిటిఎఫ్ దవళ సరస్వతి - అధ్యక్షతన వినతిపత్రం అందజేశారు. గత రెండు నెలలు అయినప్పటికి ప్రభుత్వం స్పందించక పోవడానికి-కారణాలు తెలియుట లేదని అన్నారు. వందలాది పాఠశాలలో హెచ్‌ఎం పోస్టు రద్దు చేయబడింది. రాష్ట్రంలో కొత్తగా ఎంఇఓ 2 పోస్టులు మంజూరు చేసి నియమకాలు జరిగాయి. వారికి-జీతాలు చెల్లించడానికి సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. కావున ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని జీతాలు అందజేయాలని ఎమ్మార్వో బి. సత్యంకు వినతిపత్రం ఇచ్చారు.

ఆటో యూనియన్ నూతన కార్యవర్గం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : సంతపేట వద్ద భగవతి శ్రీ సేచ్ఛావతి ఆటో యూనియన్ 24వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సమావేశమైన సభ్యులు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉలాసి యర్రయ్య అధ్యక్షునిగా, పైల ఈశ్వర రావు కార్యదర్శిగా, ఉపాధ్యక్షునిగా ముకుందరావు, సంయుక్త కార్యదర్శిగా జె.కుమార్, కోశాధికారిగా పి.తిరుపతిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా న్యాయవాది ఏ.భైరాగి, ఆర్.జాన్, బి.గోపిలు హాజరయ్యారు.

పోర్టు నిర్మాణం వల్ల వైసిపి నాయకులకు లబ్ధి

- ఎన్నికలు ముందైనా కేటీ రోడ్డు పూర్తి చేస్తారా..?
- టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

విశాలాంధ్ర-పలాస: ప్రజలకు అబద్ధపు మాటలు చెప్పడంలో మంత్రి డా.అప్పలరాజు ఆరితేరి పోయారని, గత నాలుగేళ్లుగా మత్స్యకారులకు మోసం చేసి పనికిరాని ఉపన్యాసాలు చేయడమే తప్ప మత్స్యకారులకు ఏం చేశారో చెప్పగలరా.? అంటూ టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ప్రశ్నించారు. ఆదివారం పలాస టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మత్స్యకార సామాజిక వర్గంలో పుట్టి మత్స్యకార మంత్రిగా పదవి చేపట్టి వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్ల పేటకు చెందిన 200 కుటుంబాలకు మత్స్యకార భరోసా రాకుండా అడ్డుపెట్టిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నువ్వలరేవు గ్రామానికి చెందిన మువ్వల నగేష్ ఇంజనీరింగ్ విద్యార్థి అనుమానాస్పదంలో మృతి చెందితే ఆ కుటుంబానికి ఏమి న్యాయం చేశారో చెప్పగలరా అంటూ ప్రశ్నించారు. నష్ట పరిహారము ఇప్పిస్తానంటూ నేటికీ ఆ కుటుంబానికి న్యాయం చేయలేదన్నారు. మూలపేటలో పోర్ట్ ఏర్పాటు చేయడం ద్వారా మత్స్యకారులకు లబ్ధి పక్కన పెడితే వైసీపీ నాయకులకు లబ్ధి చేకూరిందని ఆరోపించారు. మంచినీళ్ల పేట, నువ్వల రేవు ప్రాంతంలో హార్బర్ నిర్మిస్తామని మత్స్యకారులకు కళ్ళ బుల్లి మాటలు చెప్పి కేవలం రక్షణ గోడ నిర్మించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. వైసిపి హయాంలో పోర్టులు, హార్బర్లు, జట్టీలు పూర్తి చేయగలమని దమ్ముంటే చెప్పగలరా అంటూ ప్రశ్నించారు. టిడిపి హయాంలో 75 శాతం సబ్సిడీపై బోట్లు, ఇంజన్లు, వలలు మత్స్యకారులకు పంపిణీ చేసామన్నారు. 10 శాతం సబ్సిడీపై డీజిల్ ఇచ్చామని చెప్పారు. వైసిపి హయంలో మత్స్యకారులకు లీటరుకు తొమ్మిది రూపాయలు తగ్గించి ఇస్తున్నామని గొప్పలు చెప్పడమే తప్ప మత్స్యకారులకు ఇతర ఏ పథకాలైన ఇచ్చారని చెప్పగలరా అంటూ విమర్శించారు. టిడిపి హయంలో తుఫాన్ సెంటర్లు, చేపలు ఆరబెట్టేందుకు షెడ్లు నిర్మించామన్నారు. ఆఫ్ షోర్ పూర్తిచేసి ఎన్నికలకు వెళ్తామని ప్రతి సమావేశంలో చెప్పడమే తప్ప మీ హయాంలో ఆఫ్ షోర్ పూర్తి చేయగలమని చెప్పే దమ్ము ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వంలో కేవలం 9 కోట్లు మాత్రమే కేటాయించి పనులు చేపడితే టిడిపి హయాంలో 450 కోట్లు తో పనులు చేపట్టడం జరిగిందన్నారు. మంత్రి అధికార అహంకారంతో వ్యాపార సముదాయాలు ధ్వంసం చేసి నేటికీ మూడేళ్లు కావస్తున్న కేడి రోడ్డు విస్తరణ పనులు ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. ఎన్నికలు ముందైనా కేటీ రోడ్డు పూర్తి అవుతుందా అని ప్రశ్నించారు. కిడ్నీ ఆసుపత్రికి భూసేకరణ చేసి నిధులు మంజూరు చేసింది టిడిపి ప్రభుత్వమేనని దీన్ని వైసిపి నాయకులు గుర్తించు కోవాలన్నారు. వైసిపి హయాంలో నల్ల బొడ్డులూరు, సూదికొండ, నెమలి కొండలను మింగడమే తప్ప ఏమి అభివృద్ధి చేశారో చెప్పగలరా అంటూ ప్రశ్నించారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్ రావు, వజ్రపుకొత్తూరు మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, బిసి సెల్ కార్యదర్శి గోవింద పాపారావు, మందస మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, బడ్డ నాగరాజు, టంకాల రవిశంకర్ గుప్త, ముడిమించి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మృతితో మూగబోయిన విప్లవ గళం

- గద్దర్ మరణవార్త హుతాషయులైన పలువురు నేతలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ప్రజా గాయకుడు గద్దర్(74) ఇకలేరు. ఇటీవల గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి ఆదివారం తుదిశ్వాస విడిచారు. 1949లో తూప్రాన్లో జన్మించిన గద్దర్ అసలు పేరు గుమ్మడి విఠల్ రావు. ఆయన తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఎన్నో పాటలతో ఉద్యమానికి ఊపిరి పోశారు. 1969 తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఊరూరా తిరిగి ప్రచారం చేశారు. 1975లో కెనరా బ్యాంకులో క్లర్క్‌గా గద్దర్ చేరారు. తర్వాత వివాహం చేసుకున్నారు. ఆయన భార్య పేరు విమల. ఆయనకు ముగ్గురు పిల్లలు సూర్యుడు, చంద్రుడు, వెన్నెల. మా భూమి సినిమాలో సాయుధ పోరాట యోధుడు యాదగిరి పాత్రలో నటించారు. యాదగిరి పాడిన 'బండెనక బండి కట్టి' అనే పాటను ఆయనే పాడి, ఆడారు. 1984లో తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. 1985లో కారం చేడులో దళితుల హత్యలకు వ్యతిరేకంగా పోరాడారు. 1997 ఏప్రిల్ 6న పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆయన శరీరంలోకి బుల్లెట్లు దూసుకెళ్లాయి. ఒక బుల్లెట్ ఆయన శరీరంలో ఇప్పటికీ ఉంది. తన వెన్నులో ముష్కరుల తూటా ఉంచుకొని మరీ తూటాల్లాంటి పాటలతో పెత్తందార్ల వెన్నులో వొణుకు పుట్టించిన గద్దర్ ఉరఫ్ గుమ్మడి విఠల్ రావు శకం ముగిసిపోయింది. ఎన్నో ప్రజాఉద్యమాలకు ఊపిరి పోసి చైతన్యం కలిగించి విజయ బావుటాలు ఎగరేసి జనం గుండెల్లో చిరస్మనీయుడుగా నిలిచిన గద్దర్ భౌతికంగా తరలివెళ్లినా ఉద్యమం ఉన్నంతవరకు జనం నోళ్ళలో గద్దర్ పాట రూపంలో ఎప్పుడూ సజీవంగానే ఉంటుందని పలువురు అంటున్నారు.

తల్లిదండ్రులు కోల్పోయిన కుటుంబానికి మహాసేన చేయూత

- రూ.25,000 ఆర్థిక సహాయం
- మృతురాలు తులసమ్మ స్నేహితులు రూ.62,500లు అందజేత
- దాతలు స్పందించి ఆదుకోవాలని గ్రామస్తులు మనవి

విశాలాంధ్ర-సోంపేట : ఇటీవల కాలంలో మామిడిపల్లి గ్రామంలో గణేష్ సెంటర్ వీధికి చెందిన దున్న తులసమ్మ(40) పొలంలో పనులు చేస్తుండగా పాముకాటుతో మృతి చెందడంతో పాటు పదేళ్ల క్రితం ఆమె భర్త గిరి అనారోగ్యంతో మృతి చెందడంతో అన్ని తానై కుటుంబాన్ని పోషించిన తులసమ్మ మృతిచెందడంతో ఇద్దరు ఆడపిల్లలు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. సంబంధిత కుటుంబ సభ్యులు పరిస్థితి తెలుసుకుని తోటి స్నేహితులు కొంత మంది దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం మృతురాలు తులసమ్మతోపాటుగా మామిడిపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసుకున్న స్నేహితులు కుటుంబ పరిస్థితిని తెలుసుకుని రూ.62,500లు, చిన్నమామిడిపల్లి గ్రామానికి చెందిన మహాసేన యువజన సంఘం 25000 రూపాయలు ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. గ్రామంలో ఉండే కొంత మంది సంబంధిత కుటుంబానికి ఆర్థిక సహకారం అందించాలని ప్రస్తుతం ఇంటర్, డిగ్రీ చదువుతున్న ఇద్దరు ఆడపిల్లలు ఆర్థిక పరిస్థితి బాగోలేక చదువు మధ్యలో ఆపేసి తల్లికి తోడుగా ఉంటూ జీవనం గడిపిన కుటుంబానికి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఒక ప్రణాళికతో ఆ కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రయత్నం చేస్తున్నారు. దాతలు ముందుకు వచ్చి దున్న ఝాన్సీ, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బారువ బ్రాంచ్ అకౌంట్ నెంబర్ 386366339012 ఆర్థిక సహకారాన్ని అందజేసి ఆ నిరుపేద కుటుంబానికి బాసటగా నిలవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దున్న మాధవరావు, యూత్ కోఆర్డినేటర్ పాతిని నాని, సొర్ర రాము, త్రినాధ్, 1999 పదో తరగతి బ్యాచ్, మహాసేన టీం సభ్యులు పాల్గొన్నారు.

సోంపేట రోటరీకి బెస్ట్ రోటరీక్లబ్ బహుమతి

విశాలాంధ్ర-సోంపేట : సేవా కార్యక్రమాలతో పాటు ఎదుటి వ్యక్తికి సహాయం చేసేందుకు వేగంగా ముందుకు వచ్చి ఆదుకుంటున్న సోంపేట రోటరీకి బెస్ట్ రోటరీక్లబ్ అవార్డు లభించింది. సోంపేట రోటరీ క్లబ్ సేవల్లో భాగంగా రోటరీ మెడికల్ సెంటర్, సులభ్ కాంప్లెక్స్, వాకింగ్ ట్రాక్, జిమ్, స్వర్గధామం వంటి చాలా పెద్ద ప్రాజెక్టులు చేయనుండడంతో బెస్ట్ క్లబ్ అవార్డు లభించింది. ఇటువంటి కార్యక్రమాలతో సోంపేటతో పాటు ఉద్దానం ప్రజల మన్ననలు పొందుతూ ప్రజాసేవకు నిరంతరం మేము సైతం అంటూ రోటరీ క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాస్ ఆధ్వర్యంలో రోటరీ సభ్యులు ప్రతి కార్యక్రమానికి ముందడుగు వేస్తూ ఎనలేని సేవలతో అందరి ప్రశంసలు అందుకుంటుంది. ఈమేరకు విజయనగరంలో ఆదివారం జరిగిన సమ్మోహనం మెంబర్‌షిప్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో సోంపేట రోటరీక్లబ్ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు దుద్ది శ్రీను, మరో 35 మంది రోటరీ ప్రతినిధులు హాజరయ్యారు.

సృష్టిలో అతిమధురమైనది స్నేహం

విశాలాంధ్ర -శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: స్నేహంలో నిస్వార్థత, ప్రేమ, అభిమానం, ఆప్యాయత, అనురాగం ఉంటాయని కులమత బేధం ఉండదని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలు ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, వి.జి.గుప్తా, కూన వెంకటరమణ మూర్తి లు అన్నారు. అన్ని స్నేహాల కంటే బాల్య స్నేహం ఎంతో మధురానుభూతిని పంచుతుందని అన్నారు. జీవిత కాలం జ్ఞాపకమగా ఉండేది బాల్య స్నేహం మాత్రమేనని వారు అన్నారు. ఆదివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ స్నేహితుల దినోత్సవ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. సృష్టిలో అతి మధురమైనది, జీవితంలో మనిషి మరువలేనిది స్నేహం ఒక్కటేనని స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు అన్నారు. స్నేహం అనేది వందలాది రహస్యాలను పంచుకుంటూ మరియు ఒకరికొకరు శ్రద్ధ వహిస్తూ మిలియన్ల జ్ఞాపకాలను సృష్టించే అద్భుతమైన బంధం స్నేహమని ఆయన అన్నారు. రక్త సంబంధాన్ని మించిన బంధం ఏదైనా ఉంది అంటే అది ఒక్క స్నేహబంధమే నని అన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ సభ్యులు అంతా స్నేహితుల దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఒకరికొకరు అభివందనాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు ఎస్.సంజీవరావు, గొర్లె వాసుదేవరావు, ఎం.మల్లిబాబు, డాక్టర్ జి.ఎన్. రావు, వి.సి.పట్నాయక్, గుడ్ల సత్యనారాయణ, నాగేశ్వర ఈశ్వరరావు, నళిని సుధాకర్, జి.లక్ష్మీ,పి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

రెండు ముద్రలతో డిఎంయుల పాట్లు

- సిగ్నల్స్ సరిగాలేక నానా ఇక్కట్లు
- నిరసన తెలిపినందుకు డిఎంయులకు తహశీల్దార్ల నోటీసులు
- ప్రజాపంపిణీ వ్యవస్థలో గందరగోళం

విశాలాంధ్ర-సోంపేట : ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రస్తుతం గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మొన్నటి వరకు రేషన్‌కార్డుదారులకు ప్రతినెల అందించే బియ్యం, పంచదార, కందిపప్పు తదితర ఆహార వస్తువుల విషయంలో డిఎంయులు లబ్దిదారుల నుంచి ఒక వేలి ముద్రను మాత్రమే సేకరించి ఏక కాలంలో రెండు లేక మూడురకాల సరుకులు అందించిన విషయం విధితమే. ప్రస్తుత ఆగస్టు నెల నుంచి మాత్రం కేంద్ర ప్రభుత్వం పెట్టిన నిబంధనలతో డిఎంయు ఆపరేటర్లు కేంద్ర ప్రభుత్వం సరఫరా చేసే బియ్యానికి ఒక వేలిముద్ర, రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న పంచదారకు మరో వేలిముద్ర సేకరించాల్సి వస్తోంది. ప్రస్తుతం ఈ పద్ధతి డిఎంయు ఆపరేటర్లుకు తీవ్ర ఇక్కట్లు కలిగిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సరిగా లేకపోవడంతో సిగ్నల్స్ సరిగా అందక ఒక వేలి ముద్ర సేకరణకే ఆపసోపాలు పడుతున్న నేపథ్యంలో ప్రస్తుతం రెండు వేలిముద్రల సేకరణ తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రజాపంపిణీ వ్యవస్థలో సరుకుల పంపిణీ తీవ్ర జాప్యంగా మారింది. ఈ పరిస్థితి ఆపరేటర్లును మరింత ఇబ్బందికి గురి చేయడంతో జిల్లాలోను, రాష్ట్రంలోను ఇటీవల ఎండియు ఆపరేటర్లు ఒకరోజు సేవలు బంద్ చేసి నిరసన తెలిపినందుకు ఆయా మండలాల్లో తహశీల్దార్లు తాజాగా నోటీసులు జారీ చేశారు. సోంపేట మండలంలో సైతం 14 మంది ఎండియు ఆపరేటర్లుకు నోటీసులు అందాయి. ఈ పద్దతిని మార్చాలంటూ ఎండియు ఆపరేటర్లు పదే పదే కోరుతున్నా అధికార యంత్రాంగంలో ఎటువంటి స్పందన లేకపోవడం తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఒక వేలిముద్ర సేకరణకే నానా పాట్లు పడుతున్న ఆపరేటర్లు రెండు వేలిముద్రల సేకరణ వల్ల ఇదేం ఖర్మరా బాబూ అంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీరామమందిరంలో ఘనంగా గాయత్రీ మహాయజ్ఞం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడు శ్రీరామక్షేత్రంలో ఆదివారం ఘనంగా గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించారు. చాతుర్మాస వ్రతంలో భాగంగా శ్రీరామక్షేత్రం, శ్రీరామకృష్ణ రమణ కురుణ గీతాశ్రయం ప్రతినిధి సనపల కరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్థులు, భక్తులచే ఘనంగా యజ్ఞం నిర్వహించారు. చాతుర్మాస వ్రతంలో భాగంగా శ్రీరామమందిరం లో ప్రతీ రోజు ఉదయం 5 గంటల నుంచి నిత్యపూజ, విష్ణుసహస్రనామ భగద్గీత పారాయణంతో పాటు సాయంత్రం ఐదు ఆరుగంటల నుంచి ఓంకార జపం, భగవత, భగవద్గీత ప్రవచనాలు నిర్వహించారు. శ్రీరామమందిరంలో ప్రతీ ఆధివారం, ఏకదశి రోజుల్లో భక్తులచే ఘనంగా గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించటం జరుగుతుందని ఆయన తెలిపారు.

మత్స్యకార కుటుంబాలను పరామర్శించిన జనసేన నాయకులు

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని కపాసుకుద్ది, ఇసకలపాలెం గ్రామాల్లో మత్స్యకార కుటుంబాలను జనసేన నాయకులు పరామర్శించారు.జనసేన రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ చైర్మన్ బొమ్మిడి నాయకర్ ఇచ్ఛాపురం పార్టీ కార్యాలయం వద్దకు చేరుకొని ఇచ్ఛాపురం జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు సమక్షంలో జనసేన నాయకులు, వీర మహిళలు, జన సైనికులతో సమావేశం నిర్వహించారు. అనంతరం జనసేన నాయకులతో కలిసి కవిటి మండలంలోని సిహెచ్ కపాసుకుద్ది గ్రామంలో గత కొద్ది రోజుల క్రితం పడవ ప్రమాదంలో దురదృష్టవశాత్తు మరణించిన మత్స్యకారుడు బడే డిల్లేష్ కుటుంబాన్ని పరామర్శించి, వారికి జనసేన పార్టీ తరపున అండగా ఉంటామని బరోసా కల్పించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే సోంపేట మండలం ఇసకల పాలెం గ్రామంలో క్రియాశీలక సభ్యులు అయిన మత్స్యకారులు కొద్దిరోజుల క్రితం వేటకు వెళ్తూ బోటు ప్రమాదంలో మరణించిన గంట జనార్ధన్ కుటుంబాన్ని, చెన్నైలో గుర్తు తెలియని వ్యక్తులచే నిర్దాక్షిణ్యంగా చంపబడిన కోనేరు లోకేష్ కుటుంబాన్ని పరామర్శించి వారికి జనసేన పార్టీ తరపున అండగా ఉంటామని బరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బైపల్లి ఈశ్వర్ రావు, రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ కార్యదర్శి నాగుల హరి బెహరా, ఇచ్ఛాపురం మండల అధ్యక్షులు దుర్గాశి నీలవేణి రెడ్డి, జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు దుగాన దివాకర్, మున్సిపాలిటీ వార్డ్ ఇన్‌ఛార్జి లు, జన సైనికులు పాల్గొన్నారు.

ప్రశ్నించేతత్వం ప్రతి ఒక్కరికి రావాలి

వైయస్సార్సీపి పార్టీ నాయకులు తులసి

విశాలాంధ్ర-మెళియాపుట్టి : మనం ఓట్లేసి గెలిపించిన నాయకులు మనపై అధికారం చలాయించడానికి కాదని, ప్రజలకు సేవ చేయడంలో, ప్రజా సమస్యల పరిష్కారం లేక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో వెనుకబడి పోతున్న పరిస్థితిపై ప్రతిఒక్కరూ ప్రశ్నించేతత్వం అలవాటు చేసుకోవాలని నియోజకవర్గ వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు లోతుగడ్డ తులసి వరప్రసాద్ అన్నారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో కమల కళ్యాణ మండపంలో ఆదివారం మండల వైఎస్సార్సీపీ పార్టీ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక వాదం పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధి నినాదంగా జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానికేతర్ల పరిపాలన వల్ల అభివృద్ధిలో నియోజకవర్గం వెనుకబడి పోతుందని తెలియజేస్తూనే మనమంతా ఐక్యమత్యంతో కలిసిమెలిసి మరల నియోజకవర్గం అభివృద్ధి జరిగేందుకు ప్రతి వ్యక్తి, ప్రతి కార్యకర్త ముందుకు రావాలన్నారు. జిల్లాల పునర్విభజన జరిగిన తర్వాత అత్యధిక గిరిజన జనాభా ఉన్న మెళియాపుట్టి మండలంలో ఇప్పటివరకు ఐటీడీఏని ఎందుకు ఏర్పాటు చేయించలేక, తాత్సారం చేస్తున్నారన్నారు. ఈ ప్రాంతము నాది ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత నాది? అని కేవలం స్థానికులకు మాత్రమే ఉంటుందని తెలియజేస్తూనే ఎక్కడికి వెళ్లినా రహదారి సౌకర్యం గాని, త్రాగునీటి సౌకర్యం పూర్తిస్థాయిలో అందని పరిస్థితి నేడు నియోజకవర్గంలో చాలా గ్రామాలలో కనిపిస్తుందన్నారు. తితిలి తుఫాను సమయంలో పరిహారం విషయంలో ప్రజల ఆందోళన చేస్తే వారిపై ఆనాటి ప్రభుత్వం కేసులు బనాయించిందని, తెలియజేస్తూనే, ప్రస్తుతం మనందరి ప్రభుత్వం ఉందని అయినప్పటికీ కూడా కేసులు! అలాగే ఉన్నాయన్నారు. ప్రజల కష్ట నష్టాలు, కార్యకర్తల పాట్లు ఇక్కడ నాయకులకి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని అలా వ్యవహరించిన నాయకులు మనకి అవసరమా అన్నారు. భవిష్యత్తు కాలంలో మరల జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిని చేసేందుకు మనమందరం సైనికుల వలె పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానికేతరులు వద్దు స్థానికలే ముద్దు అంశంపై చాలామంది నాయకులు, కార్యకర్తలు మాట్లాడారు. ఈ సమావేశంలో ఆయనతో పాటుగా సీనియర్ నాయకులు బమ్మిడి జగన్నాథం, మజ్జి భుజంగ రావు, తూర్పు కాపు సంఘం జిల్లా అధ్యక్షులు కే. శ్రీనివాసరావు, గంగు వాసు, రాజపురం మున్న, సర్పంచ్ ప్రతినిదులు హరిచంద్ర శ్యామ్లె, పైల హరిబాబు, కరజాడ ఎంపీటీసీ రవి, ఏఎంసి డైరెక్టర్ గండేటి చిన్న, నియోజకవర్గ యూత్ కన్వీనర్ శ్రీకరుణ, పి.కృష్ణ, ముల్లేటి శ్రీనివాసాచారి, ఎస్. చిన్నబాబు, వెంకట్, ఎన్. విజయరెడ్డి, రత్నాకర్, చిన్నారావు, ఎల్. నారాయణరావు, జిల్లా జనరల్ సెక్రెటరీ ఆర్. కన్నయ్య స్వామి, ప్రజా ప్రతినిధులు, వైఎస్ఆర్సిపి పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

విశాలాంధ్ర-రణస్థలం : శాఖ గ్రంథాలయంలో మాసంలో మొదటి ఆదివారం మన గ్రంథాలయంలో ఉండే పుస్తకాలను నవలలు, కథలు, దేశ నాయకుల జీవిత చరిత్రలను, ఆధ్యాత్మిక గ్రంథాలను, ఆయుర్వేద సంబంధించినవి, సైకాలజీ, రిఫరెన్స్, కాంపిటేటివ్ బుక్స్ మాసంలో వచ్చే వార్త, పక్షమాస పత్రికలను తదితరవాటిని శాఖా గ్రంథాలయంలో ప్రదర్శనగా పెట్టారు. పాఠకులకు గృహిణిలకు, విశ్రాంతి ఉద్యోగులకు, వృద్ధులకు, విద్యార్థిని విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా తెలియజేయడానికే ఈ పుస్తక ప్రదర్శన చేయడం జరిగిందని, గ్రంథాలయాధికారి తెలిపారు. అలాగే ఈ పుస్తకాలను గ్రంథాలయ సభ్యత్వం పొంది ఇండ్లకు తీసుకొని ప్రతి 14 రోజులకోసారి పుస్తకాలను మార్చుకొని మరోక పుస్తకంను తీసుకువెళ్లి మన గ్రంథాలయంలో ఉండే వేల పుస్తకాలను చదివే అవకాశాన్ని వినియోగించుకుంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, విశ్రాంతి ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కబేలాకు తరలిస్తున్న ఆవులు పట్టివేత

విశాలాంధ్ర-పలాస : కబేలాకు తరలిస్తున్న మూగజీవాలను పలాస మండలం లక్ష్మీపురం టోల్ గేట్ వద్ద కొంతమంది యువకుల సహకారంతో పోలీసులు అతి కష్టం మీద పట్టుకున్నారు. ఇచ్ఛాపురం నుంచి విశాఖపట్నం వైపు కంటైనర్ ద్వారా ఆవులను తరలిస్తుండగా స్థానికులు గుర్తించి వాటిని ఆపడానికి ప్రయత్నించారు. వాహనాలను ఆపకపోవడంతో చివరకు టోల్ గేట్ సిబ్బందికి సమాచారం అందించి గేటు మూయించి వాటిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఇదిలా ఉండగా ఇటీవల కాలంలో ఆవులు, గేదెల ను జిల్లాకు చెందిన ఒక ముఠా కంటేనర్‌ల ద్వారా విచ్చలవిడిగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కానీ దీనిపై సంబంధిత శాఖ అధికారులు పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో ముఠా నాయకులకు పోలీసులకు, కొంతమంది విలేకరులకు ముందస్తు ఒప్పందాలు ఉండడం వలనే రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోతుందని, ఒకవేళ పోలీసులు పట్టుకున్న రాజకీయ ఒత్తిడి కారణంగా వాటిని విడిచి పెట్టేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి దీనిపై జిల్లా యంత్రాంగం దృష్టి పెడితేనే పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. మూగజీవాలను రక్షించుకోవడానికి గతంలో ఉండే మైత్రి సంఘాలను ఏర్పాటు చేసి వాటిని సంరక్షించుకుంటే మంచిదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆత్మగౌరవ పోరాటాలకు సిద్ధం కావాలి

- టీడీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి. మధు

విశాలాంధ్ర -పొందూరు: ఉపాధ్యాయ సమస్యలు కాలరాస్తున్న సర్కారు తీరుపై పరిష్కార మార్గమే ధ్యేయంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆత్మగౌరవ పోరాటాలకు సిద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైందని డెమోక్రాటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి మధు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో సిస్టం కళాశాలలో ఆదివారం నిర్వహించిన డీటీఎఫ్ శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల కౌన్సిల్ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు హక్కులను, భావప్రకటనా స్వేచ్ఛను వైసీపీ ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు హరి 0చేవిధంగా వ్యవహరించడం తగదన్నారు. ఈ పరిస్థితుల్లో ఉపాధ్యాయులు, ఉద్యోగులు తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలంటే పోరాటాలే శరణ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీఎఫ్ జిల్లా అద్యక్షులు కొమ్ము అప్పలరాజు, జిల్లా ప్రధానకార్యదర్శి పేడాడ కృష్ణారావు, జిల్లా గౌరవాధ్యక్షులు కోత ధర్మారావు, హజారీ హరిప్రశన్న తదితరులు పాల్గొన్నారు.

'యూనివర్సిటీ చిత్రం' దర్శకుడు సమావేశం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: సినీ దర్శకుడు, నిర్మాత, యాక్టర్ ఆర్. నారాయణమూర్తి ఆదివారం స్థానిక ఎన్జీవో హెంలో మీడియాతో ముచ్చటించారు. యూనివర్సిటీ చిత్రం దర్శకులు, నిర్మాత, ఆర్. నారాయణమూర్తి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల చదువుకోసం అహర్నిశలు కష్టపడి చదివించేందుకు తన రక్తాన్ని దారపోసి చదివిస్తారని, అయితే పిల్లలు కూడా అందుకు తగ్గట్టుగా చదువుకున్నప్పటికీ పేపర్ లీకేజీల వలన వారి భవిష్యత్‌లు నాశనం అవుతున్నాయని అన్నారు. దీనికి సంబంధించిందే ఈ యూనివర్సిటీ చిత్రం లో కళ్లకు కట్టినట్లు చూపించడం జరిగిందని అన్నారు. ఈయనతోపాటు ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు, వీజీకె మూర్తిలు ఉన్నారు.

ఘనంగా అమ్మవారి సంబరం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : అధిక శ్రావణ మాసం ఆదివారం నాడు శ్రీ ధనరాజ తులసమ్మ సంబరాన్ని 'దక్కత' కుటుంభీకులు నిర్వహించారు. ఎలయన్స్‌క్లబ్ పి.ఆర్.ఓ దక్కత గోపీనాథ్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారి ఘటాన్ని ఊరేగింపుగా తీసుకెళ్ళి నైవేధ్యాన్ని సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. లొద్దపుట్టి ధనరాజ తులసమ్మ ఆలయంవద్ద ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్నేహితుల దినోత్సవం నాడు నిర్వహించిన కార్యక్రమం కావడంతో గోపీనాథ్ స్నేహితులు అంతా ఒక్కచోట చేరి సందడి చేసారు.

ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-పొందూరు: విశాఖపట్టణంలో మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృ చెందిన 2013 బ్యాచ్ కానిస్టేబుల్ పొందూరు మండలం గోకర్ణపల్లి గ్రామానికి చెందిన కం చరాన విఠల్ రావు కుటుంబానికి గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న 2013 బ్యాచ్ కానిస్టేబుల్లు రూ లక్ష రూపాయల ఆర్థికసహాయాన్ని అందించారు. గతంలో శ్రీకాకుళం, విశాఖపట్టణం, సిటీ, రూరల్కు చెందిన 2013 కానిస్టేబుల్లు విఠల్రావు బార్యకు రూ 5.11500 అందిచారు. ప్రస్తుతం గుంటూరు పోలీసులు అందించిన లక్ష నగదును గోకర్ణపల్లిలో విఠల్రావు భార్యకు కానిస్టేబుల్ అనంత్ తదితరులు అందించారు.

వరి పంట సాగులో 'లైన్ షోయింగ్'

విశాలాంధ్ర-ఆమదాలవలస: మండలం ప్రకృతి వ్యవసాయ భాగంలో భాగంగా సిబ్బంది రైతులచేత వరి లైన్స్ శోయింగ్ విధానంలో వరి నాట్లు వేయిస్తున్నారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి మాట్లాడుతు ఆదివారం చేపేనపేట యూనిట్ లో ఆరు ఎకరాల విస్తీర్ణంలో లైన్ షోయింగ్ చేయించామని అన్నారు. అలాగే మా సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతులు వద్ద ఉండి వరి నారు శుద్ధి చేయించి అలాగే కొసలు తుంచి నాట్లు వేయిస్తున్నారని అన్నారు. రైతులు చేత వరి సాగులో తప్పకుండా రాజీలేని సూత్రాలను పాటించేలా చేస్తున్నామని అలాగే ఈ విధంగా వరుసక్రమాలలో నాట్లు వేసుకుంటే పంటలు అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తిరుపతిరావు, కృష్ణవేణి, లక్ష్మి, జానకిరామ్ పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 1033 గ్రామ పంచాయతీల్లో ఎలక్షన్ నోటిఫికేషన్

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ ఖాళీగా ఉన్న గ్రామ పంచాయితీ మరియు వార్డు నెంబర్‌లో ఎన్నికల నిర్వహణకు ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా సరుబుజ్జిలి మండలంలో ఖాళీగా ఉన్న బప్పడం గ్రామపంచాయతీ మరియు టేలికిపెంట పంచాయతీలో ఖాళీగా ఉన్న 10వ వార్డు గాను ఎన్నికలు నిర్వహించినట్లు ఎంపీడీవో మోహన్ కుమార్ తెలియజేశారు. ఆగస్టు 8 నుంచి నామినేషన్ ప్రక్రియ మొదలవుతుందని, ఆగస్టు 19న ఎన్నికల నిర్వహిస్తామని తెలియజేశారు.

సమగ్రాభివృద్ధి సంకల్పయాత్రను ప్రారంభించనున్న సిరిపురం

విశాలాంధ్ర-పాతపట్నం: మండలంలో ఆదివారం సిరిపురం తేజేశ్వరరావు క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతపట్నం సమగ్రాభివృద్ధికి సంకల్పయాత్ర అనే కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభించడం జరుగుతుందని తెలియజేశారు. దేశానికి స్వతంత్రం వచ్చి 76 ఏళ్లవుతున్నా ఆంధ్రప్రదేశ్‌లో చిట్టచివర ఉన్న పాతపట్నం నియోజకవర్గం అభివృద్ధిలోనూ అట్టడుగునే మగ్గిపోతుందని, అపారమైన సహజ వనరులు అంతకుమించిన మానవ వనరులు మన సొంతం అద్భుతమైన తెలివితేటలు కష్టపడే తత్వం కలిగిన ప్రజలు మన పాతపట్నం ప్రాంతానికి ప్రత్యేకం అయినా సరే పాతపట్నం ఎప్పటికీ పాతపట్నం గాని మిగిలిపోయిందన్నారు. ఉపాధి కొరకు పొట్ట చేత పట్టుకొని వేళ్ల మైళ్ళ దూరంలో వలస కూలీలుగా బతుకీడాల్చిన దుస్థితి ఉందన్నారు. వలసల వారసత్వ పాలకుల నుండి పాతపట్నం నియోజకవర్గానికి విముక్తి కలగాలని ఆయన తెలియజేశారు. పాతపట్నం నియోజకవర్గాన్ని ఇన్నాళ్లపాటు పాలించిన వలస పాలకులు, కుటుంబ వారసత్వ నాయకులే దీనికి కారణం అనేది అసలు సిసలైన నిజమని అన్నారు. సిరిపురం విధి విధానాలను తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో తను పాతపట్నం నియోజకవర్గం నుండి పోటీ చేస్తానని సిరిపురం తేజేశ్వరరావు తెలియజేశారు.

మణిపూర్ ఘనటపై క్రిష్టియన్ సోదరులు ర్యాలీ

విశాలాంధ్ర-పొందూరు: మణిపూర్‌లో జరుగుతున్న దారుణకాండను నిరసిస్తూ మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. క్రిష్టియన్ యువతులను నగ్నంగా ఊరేగించడం, అత్యాచారాలు, హత్యలు దురదృష్టకరమని ఈ సంఘటన లకు కారణమైన వారందరినీ కఠినంగా శిక్షించాలంటే నినాదాలు చేశారు. మండల కేంద్రం లో భారీ మానవ పొందూరులో అంబేద్కర్ కూడలి నుంచి ర్యాలీ నిర్వహించి ఆర్టీసీ కాంప్లెక్స్ మానవహారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండలంలో పాస్టర్లు సీహెచ్ ప్రభుదాస్, సీహెచ్ జీవన్, జె. వసంత కుమార్, నాగేశ్వరరావు, ఎస్తేర్రాణి, ఎలీషా, జోషఫ్, రెడ్డి. సాత్విక, ఇజ్రాయేలు తదితరులు పాల్గొన్నారు.

సన్ స్కూల్ విద్యార్థికి ట్రిపుల్ ఐటీలో సీటు

విశాలాంధ్ర-హిరమండలం: 2023 సంత్సరపది ఫలితాల్లో మండల స్థాయిలో అత్యదిక మార్కులు (584)సాధించినహిర మండలం పెద్ద కోరాడలోని 'సన్ స్కూల్' విద్యార్థి పొన్నాన సుమంత్ ట్రిపుల్ ఐటీ రెండో విడత ప్రవేశాల కౌన్సెలింగ్‌లో ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడని పాఠశాల కరస్పాండెంట్ జి జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఉపాద్యాయ సిబ్బంది సుమంత్‌ను అభినందించారు. మా పాఠశాల క్రమశిక్షణకు విద్యా బోధనకు మారుపేరుగా నిలుస్తుందని ఎందరో విద్యార్థులు ఉన్నత శిఖరాలు సాధిస్తూ పాఠశాలకు పేరు ప్రాక్యతలు తీసుకువస్తున్నారని ఉపాధ్యాయులు తెలిపారు.